క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14 రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం పోటీలకు ఎంపికై న విద్యార్థులను అభినందించారు. పీఈటీ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అబ్దుల్, జుబేద్, శ్రీనివాసులు, నరసింహ, సురేంద్ర, అక్రమ్ ఈ నెల 16 నుంచి 17వ తేదీ వరకు పల్నాడుజిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కిషోర్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

19న రుద్రకోడూరులో కల్యాణోత్సవం

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రుద్రకోడూరు క్షేత్రంలో వెలసిన శ్రీరుద్రాణి, రుద్రకోటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 18వ తేదీన రుద్రకోటేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, మహామంగళహారతి, రాత్రి భక్తుల సౌకర్యార్థం సత్యహరిశ్చంద్ర నాటకం, భజనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎర్రగూడూరు నుంచి ప్రభలు శనివారం సాయంత్రానికి రుద్రకోడూరు క్షేత్రానికి చేరుకుంటాయన్నారు. ఆదివారం శ్రీరుద్రాణి సమేత రుద్రకోటేశ్వర స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 18 నుంచి 19వ తేదీ సాయంత్రం వరకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

దుండగులను అరెస్టు చేయాలి

పాములపాడు: నంద్యాల పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అబ్రహాం, బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ స్వాములు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బాలస్వామి, అంకన్న, రాము, చిన్నస్వాములు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎంఆర్‌జీఎస్ నాయకులు దరగయ్య, మండలాధ్యక్షుడు బుజ్జిమాదిగ డిమాండ్ చేశారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సువర్ణమ్మ

జూపాడుబంగ్లా: ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. కేవలం గంటలోపే ముగించేశారు. వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమస్యలు ఏమైనా ఉంటే రాసివ్వాలని అధికారులు సభ్యులను కోరగా ఒక్కరు కూడా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లటం కానీ, రాసివ్వడం కానీ చేయకపోవటంతో సభను ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజులవాణి, ఏఓ కృష్ణారెడ్డి, ఎంఈఓ మోహన్, మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం.. గేదె మృతి

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలోని బీసీ కాలనీలో మల్లికార్జున స్వామప్పకు చెందిన పశువుల పాక, గడ్డివామికి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. పశువుల కొట్టంలో ఉన్న గేదె పూర్తిగా కాలి మరణించింది. రెండు ఎద్దులు, మూడు దూడలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక సిబ్బంది కర్నూలు నుంచి హుటాహుటిన చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అదేవిధంగా పశువైద్యాధికారి చంద్రమోహన్ గ్రామానికి చేరుకొని గాయపడిన జీవాలకు చికిత్స అందించారు.

వందశాతం పంట నమోదు

కొత్తపల్లి: మండలంలో 2023 సంవత్సరానికి గాను రబీ సీజన్‌లో 100 శాతం పంట నమోదు కార్యక్రమం పూర్తి అయ్యిందని ఏఓ కె.మహేష్ బుధవారం తెలిపారు. మండలంలో 2,536 మంది రైతులు 7,727 ఎకరాలలో రబీ సీజన్ మినుము, మిరప, మొక్కజొన్న తదితర పంటలను సాగుచేసుకున్నారన్నారు. వీరందరితో ఆర్బీకే సిబ్బంది పూర్తిస్థాయిలో పంట నమోదు చేయించినట్లు తెలిపారు. పంటన మోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల వర్తిస్తాయన్నారు.

పంచముఖేశ్వరుడు.. శ్రీశైలవాసుడు

శ్రీశైలం: సృష్టిలయకారుడి లీలలు, శివసప్త స్వరూపాల విశేషాలను ఎన్నో పురాణాలు చెబుతున్నాయి. లింగములు ఏడు విధములు అవి స్వయంభూ, దివ్య, మానుష, ఆర్ష, రాక్షస, దైవిక, బాణ. వీటినే సప్తవిధ లింగములు అంటారు. బాణాసురుడు 14 కోట్ల లింగములను ప్రతిష్ఠించాడట. వీటిని బాణలింగములని అంటారు. ఇవి గండకి, నర్మదా నదులలో దొరుకుతాయని భక్తుల విశ్వాసం. ఈ బాణలింగములు మాత్రమే పూజార్హమైనవని చెబుతారు.



శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి

శివుని పంచముఖాలు

ఆది అంతాలు లేని ఆ పరమశివునికి పంచ ముఖాలు ఉన్నాయి. శివుని అవతారాలలో ప్రధాన అవతారాలు ఐదు. వీటినే శివుని పంచ అవతారాలని, పంచబ్రహ్మలని, పంచముఖ శివుడిగా కొలుస్తుంటారు. సద్యోజాతుడు, వామదేవుడు, తత్పురుషుడు, అఘోరుడు, ఈశానుడు ఇవి శివుని పంచముఖాలు. ఒకే లింగంలో నాలుగు లింగాలు కలిగిన లింగమూర్తిని పంచముఖేశ్వరుడని అంటారు. ఇలాంటి లింగం శ్రీశైలాలయంలో ఒక పరివారదేవాలయంగా ఉంది.

సద్యోజాతుడు

శివుని ముఖాలలో ఒకటైన సద్యోజాతుడు ముఖం చంద్రుడు వలే, తెల్లని పాలవలే, తెల్ల కలువ పుష్పంలాగా, లేత పసుపురంగు కలిసి తెలుపు రంగుతో ధవల కాంతితో ప్రకాశిస్తుంటుందని అంటారు. ఈ సద్యోజాత ముఖం నుండే గాయత్రి మొదలైన 2 కోట్ల మంత్రములు పుట్టినవని, వీనినే వైదిక మంత్రములని లేదా పూర్వామ్నాయ మంత్రములని అంటారు.

ఈశాన మూర్తి

మధ్యాహ్న సూర్యుడిలోని స్ఫటిక శ్వేత నిర్మాలాకాశ వర్ణముతో ఈశానుని ముఖం శుద్ధస్ఫటికం వలే ప్రకాశిస్తుంటుంది. ఈశాన్య ముఖం నుంచి బ్రహ్మ విద్యకు సంబంధించిన బ్రహ్మానందములు కలిగించే కోటి మంత్రాలు పుట్టాయి. వీటిని ఊర్ధ్వమ్నాయ మంత్రాలని అంటారు. ఈ విధంగా ఏడు కోట్ల మంత్రాలు శివుని పంచ ముఖాల నుంచి పుట్టాయి. ఈ మంత్రాల ద్వారా అనేక విద్యలు ఆవిర్భవించాయి.

పంచమూర్తులు కొలువై ఉండే లింగ స్వరూపం

లింగములో సద్యోజాతుడు పశ్చిమాభిముఖంగా ఉంటూ పడమర దిక్కున, వామదేవుడు ఉత్తరాభిముఖంగా ఉంటూ ఉత్తర దిక్కును చూస్తూంటాడు. తత్పురుషుడు తూర్పుదిక్కును, అఘోరుడు దక్షిణ దిక్కునను, ఈశానుడు ఊర్ధ్వ ముఖంగా ఆకాశాన్ని చూస్తుంటాడు. ఎవరైతే లింగ ఆరాధన చేస్తారో, వారు పంచ బ్రహ్మలను ఒకే సమయాన ఆరాధించినవారవుతారు. మహాశివరాత్రిన శివుని ఆరాధించి తరించాలని పండితులు చెబుతుంటారు.

తత్పురుష

ప్రళయాగ్నిలో వెలిగే విద్యుత్ కాంతి వంటి వర్ణముతో తత్పురుషుడి ముఖం ప్రకాశిస్తుంది. తత్పురుష ముఖం నుంచి మహావిద్య మొదలైన రెండు కోట్ల మంత్రములు పుట్టాయని, వీటిని ఉత్తరామ్నాయ మంత్రములని అంటారు.

అఘోరమూర్తి

అఘోర మూర్తి ముఖం మేఘం వలే పొగలాగ నీలం, నలుపు కలిసిన నల్లని తుమ్మెద నీలపు వర్ణంతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ అఘోర ముఖం నుంచే వైష్ణావాగమంలోని కోటి మంత్రములు పుట్టాయని, వీటినే పశ్చిమామ్నయ మంత్రాలని అంటారు.

వామదేవ

మొగలిపువ్వు వర్ణం, గౌరవవర్ణంతో వామదేవుని ముఖం ప్రకాశిస్తుంది. వామదేవ ముఖం నుంచి దక్షిణామూర్తి మంత్రం మొదలగు కోటి మంత్రములు పుట్టాయి. వీటినే దక్షిణామ్నాయ మంత్రమని అంటారు. శైవాగమ మంత్రాలని వీటికి పేరు.

శాస్త్రోక్త పూజలతో శివానుగ్రహం

శ్రీశైలం: పరమశివునికి అత్యంత ప్రీతికమైన రోజు మహాశివరాత్రి. అదే రోజు శనిత్రయోదశి రోజున మహాశివరాత్రి కలిసి రావడం మహత్తరమైన రోజుగా సాధకులు, భక్తులు భావిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా శివదీక్షా భక్తులతో పాటు శివానుగ్రహం పొందగోరే వారు శాస్త్రోక్తంగా విధివిధానాలతో పూజ చేసి సత్ఫలితాలు పొందవచ్చని పండితులు పేర్కొంటున్నారు. మహాశివరాత్రి ఆచరణకు సంబంధించి మూడు విధులు ప్రధానంగా చెబుతారు. పగలు ఉపవాసం, రాత్రి శివపూజ, జాగరం ముఖ్యమైనవి. మహాశివరాత్రి ఆచరణలో శనివారం త్రయదశినాడు ఒకపూట మాత్రమే భోజనం చేసి రెండవ పూట నిరాహారంగా ఉండాలి. పూర్తిగా నిరహారంగా ఉండలేని వారు అల్పాహారం లేదా పండ్లను తీసుకోవచ్చు.

వేకువజామునుంచే పూజలు

మహాశివరాత్రి నాడు వేకువజామున లేచి స్నానాదికాలు చేసి లింగదర్శనం చేసుకోవాలి. అవకాశాన్ని బట్టి నదీ స్నానం చేయడం మంచిది. ఆ తరువాత శివాలయంలో గాని, ఇంట్లో గాని పరమేశ్వరుడిని శక్తి కొలది అభిషేకించి, అష్టోత్తర శతనామాలతో అర్చించాలి. అవకాశం మేరకు ఆ రోజంతా శివపంచాక్షరి మంత్రాన్ని జపిస్తుండాలి.

నాలుగు జాముల పూజ

మహాశివరాత్రి నాడు నాలుగు జాముల్లోనూ విధివిధానంగా శివుడికి అర్చించాలని శివపురాణం చెబుతోంది. సూర్యాస్తమయం నుంచి నాలుగు జాములుగా విభజించాలి. ఒక జాము మూడుగంటలు ఉంటుంది.

మొదటి జాము

సమయం – సాయంత్రం 6.30 నుంచి 9.30



ఈ మొదటి జాము చేసే పూజలలో రుగ్వేద మంత్రాలను పఠించాలి. స్వామికి జలాభిషేకం చేసే ముందు పాలతో అభిషేకించాలి. తరువాత పునుగు కలిపిన గంధాన్ని అర్పించి నల్ల నువ్వులు, అక్షింతలు, భానుడు పూలు, గన్నెరు పూలతో స్వామిని అర్చించాలి. బియ్యం, పెసరపప్పు, కలిపి వండిన పులగం, కట్టు పొంగలిని నివేదించాలి.

రెండవ జాము

సమయం – 9.30 నుంచి 12.30



రెండవ జామున యజుర్వేద మంత్రాలతో పూజించాలి. ముందుగా స్వామికి పెరుగుతో అభిషేకించాలి. బియ్యం తులసీదళాలు, పాయసాన్ని నివేదించాలి. పూలతో స్వామిని అర్చించాలి. పాయసాన్ని నివేదించాలి.

మూడవ జాము

సమయం – 12.30 నుంచి వేకువజామున 3.30 వరకు



సామవేద మంత్రాలతో మూడవ పూజను కొనసాగించాలి. ఈ జాములో ముందు నేతితో స్వామిని అభిషేకించి జలాభిషేకాన్ని చేయాలి. గోధుమలు, మారేడు దళాలు, జిల్లెడు పూలతో స్వామిని పూజించాలి. నువ్వుల పొడిని కలిపిన తినుబండరాలను నివేదనగా అర్పించాలి.

నాల్గవ జాము

సమయం – 3.30 నుంచి ఉదయం 6.30 వరకు



నాలుగవ జామున స్వామిని తేనేతో అభిషేకించుకొని జలంతో అభిషేకించాలి. తరువాత మినుములు పెసలు, పలు రకాల ధాన్యం, కలువపూలతో పూజించాలి. అన్నం, నేతి గారెలు, భక్షం మొదలైన వాటిని నివేదనగా సమర్పించాలి. అధర్వణ వేద మంత్రాలను పఠించాలి. ఈ విధంగా నాలుగు పూజలను చేయలేని వారు కనీసం ఈ విధంగా జరిగే పూజలను చూసేందుకు ప్రయత్నించాలి. అది కూడా వీలు లేనప్పుడు తమ శక్తి కొలది శివున్ని అర్చించాలని శివపురాణం చెబుతుంది.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలపాతాళ గంగ వద్ద వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారని, ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సూచించారు. బుధవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, మధుసూదన్‌రెడ్డిలతో కలిసి పాతాళగంగ వద్ద ఏర్పాట్లును పర్యవేక్షించారు. పాతాళగంగలో ఏర్పాటు చేసిన బారికేడింగ్, జల్లు స్నాన ఏర్పాట్లు, దుస్తులు మార్చుకొనే గదులు, శౌచాలయాలు మొదలైన వాటిని పరిశీలించారు. పాతాళ గంగ వద్ద విధులు నిర్వహిస్తున్న గజ ఈతగాళ్లకు పలు సూచనలు చేశారు.



పాతాళగంగ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

కైలాస ద్వారం వద్ద భక్తులకు అన్నదానం

శ్రీశైలంటెంపుల్: కైలాసద్వారం వద్ద దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఈఓ ప్రారంభించారు. పత్తికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి ప్రతి రోజు 10 వేల మంది భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ యన గత 16 సంవత్సరాలుగా కైలాసద్వారం వద్ద కాలినడక భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపడుతున్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, దేవస్థానం ఈఈ రామకృష్ణ, ఏఈఓ ఫణిధరప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఈఓ లవన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి

ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా బుధవారం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కైలాసద్వారం, భీమునికొలను మెట్ల ప్రారంభ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాదయాత్రగా వస్తున్న పలువురు భక్తులతో సంభాషించి కాలిబాట మార్గంలో ఏర్పాట్లపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఉచిత వైద్యశిబిరాన్ని పరిశీలించారు.

అలుగుతోనే సీమ సస్యశ్యామలం

జూపాడుబంగ్లా: సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి ఆయనతో పాటు సీపీఐ నాయకులు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా రాయలసీమ ప్రాంతం వెనుకబడిపోతున్నా అభివృద్ధికి ఎవరూ దోహదపడటం లేదన్నారు. సీమ అభివృద్ధి చెందాలంటే ఐకాన్ వంతెన స్థానంలో సిద్ధేశ్వరం అలుగుతో కూడిన వంతెనను నిర్మించి రాయలసీమ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అలాగే ఎగువ ప్రాంతమైన కర్ణాటకలో భద్ర ప్రాజెక్టు నిర్మాణంపై అధికార, ప్రతిపక్షపార్టీలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, అక్కినేని వనజ, ఓబులేసు, ఈశ్వరయ్య, రామచంద్రయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడితో శ్రీశైలానికి శివస్వాములు

పగిద్యాల/పాములపాడు/ జూపాడుబంగ్లా: మండలం, అర్ధమండలం శివ దీక్ష తీసుకున్నా శివస్వాములు ఇరుముడి ధరించి బుధవారం శ్రీశైలానికి బయలుదేరారు. బంధు, మిత్రులు మాల ధరించిన వారికి కొత్త బట్టలు, నగదును ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకున్నారు. గ్రామ పొలిమేర వరకు బాజాభజంత్రీలతో సాగనంపారు. పడమర ప్రాతకోటలోని స్వాములు కాశీశ్వర, నందీశ్వరస్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు సాగనంపారు. జూపాడుబంగ్లా మండలంలోని తాటిపాడు, తంగడంచ, జూపాడుబంగ్లా గ్రామాలకు చెందిన శివస్వాములు ఆయా గ్రామాల్లో బిక్షాటన చేసిన ఆహారధాన్యాలతో భోజనాన్ని తయారుచేసి ఆయా గ్రామాల్లోని ప్రజలకు సహపంక్తి భోజనాలు పెట్టారు.

వందలాదిగా శ్రీగిరికి శివభక్తులు..

జూపాడుబంగ్లా: పెరుగుతున్న ఎండల తీవ్రతను లెక్కచేయక శ్రీశైల శివభక్తులు మల్లన్న సన్నిధికి వడివడిగా అడుగులేస్తూ శివనామస్మరణతో కేజీరోడ్డు వెంట శ్రీగిరికి వెళ్తున్నారు. జిల్లాలోని ఆదోని, డోన్, మంత్రాలయం, కర్ణాటక రాష్ట్రం, తెలంగాణ ప్రాంతాలకు చెందిన భక్తులు కాలినడకన శ్రీశైలం తరలివెళ్తున్నారు. శ్రీశైలం వెళ్లే భక్తుల ఆకలిదప్పికలను తీర్చేందుకు భక్తులు అడుగు అడుగునా అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



కాలినడక శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు

రాత్రంతా కృష్ణానదిలోనే జాగారం

- ప్రయాణికులను నది మధ్యలో గట్టుపై వదిలేసిన తెలంగాణ బోట్ల నిర్వాహకులు
- రాత్రంతా బిక్కుబిక్కుంటూ గడిపిన శివస్వాములు, భక్తులు
- ఆంధ్ర అధికారుల చొరవతో సంగమేశ్వరం చేరిన వైనం

కొత్తపల్లి: ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల బోటు నిర్వహకుల నిర్వాకం కారణంగా తెలంగాణ శివస్వాములు, భక్తులు, ప్రయాణికులు రాత్రంలో కృష్ణానది మధ్యలో గడపాల్సి వచ్చింది. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేల సంఖ్యలో భక్తులు బోట్లపై మల్లేశ్వరం, సోమశిల నుంచి కృష్ణానదిని దాటి కాలినడకన శ్రీశైలం వెళ్తుంటారు. ఈ ఏడాది ఆదే తరహాలో తెలంగాణ నుంచి సుమారు 200 మంది శివస్వాములు, 200 మంది భక్తులు మల్లేశ్వరం నుంచి సంగమేశ్వరం వైపు బోట్లో కృష్ణానది దాటేందుకు వచ్చారు. అయితే తెలంగాణ, ఆంధ్ర బోటు నిర్వహకుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ బోటు నిర్వాహకులు దాచిపెట్టి సమారు ఐదారు బోట్లలో భక్తులను కృష్ణానదిలో తీసుకొస్తుండగా.. సంగమేశ్వరం బోట్ల నిర్వాహకులు కొత్తపల్లి పోలీసులకు సమాచారమందించారు. దీంతో పోలీసులు తెలంగాణ బోటు నిర్వాహకులకు ఫోన్ చేసి ఆంధ్రవైపు కృష్ణానదిలో తిప్పకూడదని, ఇవతలి వడ్డుకు రావద్దని హెచ్చరించారు.

మధ్యలో వదిలేసిన బోటు నిర్వాహకులు

పోలీసుల హెచ్చరిక నేపథ్యంలో తెలంగాణ బోటు నిర్వహకులు శివస్వాములను, భక్తులను కృష్ణానది మధ్యలో ఓ గుట్టపై దింపి.. ఇక్కడివరకే మాకు అనుమతులు ఉన్నాయని, అవతలికి రాలేమని వెళ్లిపోయారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు తిండి, నీరులేక శివస్వాములు, భక్తులు ఇబ్బంది పడ్డారు. బుధవారం ఉదయం కొత్తపల్లి అధికారులకు సమాచారం అందడంతో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో వారిని తెలంగాణకు చెందిన బోట్లలోనే ఇవతలి గట్టుకు రప్పించారు. కొత్తపల్లి పోలీసులు తెలంగాణ భక్తులకు సంగమేశ్వరం వద్ద ఉన్న కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన సత్రంలో భోజన సదుపాయం కల్పించి కాలి నడకన శ్రీశైలం మహాక్షేత్రానికి పంపించే ఏర్పాట్లు చేయడంతో కథ సుఖాంతం అయ్యింది.

పందుల నుంచి పంటలను కాపాడండి

బండిఆత్మకూరు: పందులు పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని, వాటి బారిని నుంచి పంటలను కాపాడాలని కోరుతూ రైతు సంఘం పెద్దలు బుధవారం ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డికి, ఎంపీడీవో వాసుదేవ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణమల్లారెడ్డి మాట్లాడుతూ పందులు రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుముతో పాటు ఇతర పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో దేసు మనోహర్‌రెడ్డి, దేసు శ్రీనివాసరెడ్డి, అవుటాల నాగేశ్వరరెడ్డి, అవుటాల సుబ్బారెడ్డి, ఉశేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో మంటలు

మహానంది: మహానంది సమీపంలోని ఆలయం వెనుక ఉన్న నల్లమల అడవిలో బుధవారం రాత్రి మంటలు వ్యాపించాయి. గత రెండ్రోజుల నుంచి నల్లమల అడవి కాలిపోతుందని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నల్లమలలోకి ప్రవేశించి నిప్పు పెట్టడంతో మంటలు దావానంలా వ్యాపించాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేరకు మంటలు వ్యాపించడంతో నల్లమల అగ్నికి కాలుతుందని, అటవీశాఖ సిబ్బంది స్పందించి మంటలను ఆర్పేయాని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈద్గా గోడ కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న ముస్లింల ఈద్గా గోడలను కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం మతపెద్దలు కోరారు. బుధవారం పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ ఎన్‌వీ రమణకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ఈద్గా గోడలను రాజావీధికి చెందిన రఘు అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా జేసీబీతో కూల్చివేశాడని తెలిపారు. ఇలా చేయటం వల్ల ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందన్నారు. రఘుపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, రఫి, అబ్దుల్లా, అబ్దుల్ రహిమాన్, సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన వైద్యశాలకు మందుల విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థాన వైద్యశాలకు హైదరాబాద్‌కు చెందిన సాగర్‌సాఫ్ట్ లిమిటెడ్ వారు వివిధ రకాల మందులను విరాళంగా అందజేశారు. ఈ మందులను దాతలు బుధవారం ఏఈఓ ఫణిధర్‌ప్రసాద్‌కు అందజేశారు. ఈ మందులలో జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఊపిరితిత్తుల వ్యాధులు, గ్యాస్ట్రబుల్, ఇన్ఫెక్షన్ మొదలైన వ్యాధులకు సంబంధించినవి ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అపోలో డాక్టర్లు గణేష్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత ల్యాబ్‌టెక్నీషియన్ రాఘవేంద్రుడు, గుమాస్తా కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మందులను ఏఈఓ కు అందజేస్తున్న దాతలు

విద్యుదాఘాతంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

జూపాడుబంగ్లా: చిన్నాన్నను ఖననం చేసొచ్చిన గంటల వ్యవధిలోనే నందికొట్కూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు(44) విద్యుదాఘాతంతో మృతిచెందటం పలువురిని కలిచివేసింది. జూపాడుబంగ్లా గ్రామంలోని నీలిపల్లెపేటకు చెందిన చిన్నస్వామన్న అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ఆయనను ఖననం చేసొచ్చిన తర్వాత కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు స్నానాలు ముగించుకున్నారు. ఆర్టీసి డ్రైవర్ నాగేశ్వరరావు మనోవేదనతో ఇంటిపైకి ఎక్కగా పైన వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించసాగారు. ఇంటిపైన ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని అనేక మార్లు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని తొలగించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతునికి భార్య సుమతి, కొడుకు వంశీ, కుమార్తె అశ్విని ఉన్నారు.

వంట నిర్వాహకులను తొలగించాలి

జూపాడుబంగ్లా: మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండి పెట్టకుండా విద్యార్థుల కడుపుకొడ్తున్న సీఎస్ఐ స్కూల్ వంట నిర్వాహకులను తొలగించాలని పీడీఎస్‌యూ నాయకుడు ఆది కోరారు. బుధవారం పీడీఎస్‌యూ నాయకులు నందికొట్కూరు పట్టణంలోని సీఎస్ఐ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సాయిప్రకాశ్, మద్రిస్వామి, గణేష్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తనివ్వకండి

బండిఆత్మకూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చేతిపంపులు పనిచేస్తున్నాయో లేదో వాటిపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందో గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా నివేదికలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి నివారణకు నిధుల కొరత లేదని తెలిపారు. అవసరమైన చోట పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

మహానందికి చేరిన పెళ్లిపెద్దలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో జరిగే శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి కళ్యాణోత్సవానికి పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ, బ్రహ్మనందీశ్వరస్వామి వార్లు బుధవారం రాత్రి మహానంది చేరారు. మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం నంద్యాలకు వెళ్లిన విషయం తెలిసిందే. పెళ్లిపెద్దలతో కలిసి మహానందికి చేరుకున్నారు. నంద్యాలలో ఇరువురు గ్రామోత్సవంగా పర్యటించి భక్తుల చేత పూజలందుకుని తిరిగి మహానందికి వచ్చారు. కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం అనంతరం బ్రహ్మనందీశ్వరస్వామి దంపతులు నంద్యాలలోని ఆలయానికి వెళ్తారు.

స్వామికి ముత్యాల తలంబ్రాలు

మహాశివరాత్రి రోజున జరిగే స్వామి కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలను హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీనివాసగౌడు అందించినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ. 50వేల విలువైన అర కిలో ముత్యాలను పంపించినట్లు చెప్పారు.

ఓంకారంలో వైద్య శిబిరం

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం డాక్టర్ షరీఫ్ తెలిపారు. ఈ నెల 18న వైద్య శిబిరం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని రెడ్ క్రాస్ సభ్యులు, గ్రామీణ వైద్యులందరు తప్పక హాజరు కావాలని కోరారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

పాములపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో గృహాలు మంజూరు కానివారు సొంత స్థలం ఉంటే పక్కా గృహం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో అసిస్టెంటు ఇంజినీరుకు అర్జీ ఇచ్చి రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు 540 మంది అర్జీలు ఇచ్చారన్నారు. కాగా వారిలో 420 మంది అర్హులుగా గుర్తించామని వివరించారు.

గాజులపల్లెలో చోరీకి యత్నం

మహానంది: గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు కలర్స్ ఉమాదేవి ఇంట్లో బుధవారం చోరీ యత్నం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ప్రధాన ద్వారానికి ఉన్న గడియను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగలగొట్టి చోరీకి యత్నించారు. సమీపంలో ప్రజలు గుర్తించి కేకలు వేయడంతో పరుగులు తీసినట్లు స్థానికులు తెలిపారు.